యుటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

ఆవిష్కరిస్తున్న ఎంఇఓ కృష్ణమూర్తి

ప్రజాశక్తి- పెదబయలు : మండల విద్యాశాఖ కార్యాలయంలో యుటిఎఫ్ డైరీ, కేలండర్‌ను సోమవారం ఎంఇఓ కొమ్ము కృష్ణమూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు జె.సత్యనారాయణ ఎన్ శ్రీనుబాబు, కె ఆనంద్, సిహెచ్ ప్రవీణ్, సింహాచలం, ఇతర ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించిన వారిపైనే దాడులు!

- మన్యంలో రెచ్చిపోతున్న భూబకాసురులు
- ప్రభుత్వ భూములను మింగేస్తున్న భూమాఫియా
- అభ్యంతరం చెప్పిన సిపిఎం నేతపై దాష్టీకం
- ఫిర్యాదు చేసినా కేసు నమోదులో పోలీసుల నిర్లక్ష్యం

సిపిఎం నేత వెంకటరమణపై కర్రలతో దాడిచేస్తున్న రియల్టర్ అనుచరులు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి -అనంతగిరి : మన్యంలో భూబకాసురుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. నాన్ షెడ్యూల్ ప్రాంతంలోని ప్రభుత్వ భూములపై మైదాన ప్రాంతానికి చెందిన కొంతమంది కన్నేసి కబ్జాకు పాల్పడుతున్న ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. దీనిపై ప్రశ్నించిన వారెవరైనా వారిపై దాడులు చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం భూమాఫియాకు నిత్యకృత్యంగా మారింది. తాజాగా సరియాపల్లిలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై అభ్యంతరం వ్యక్తం చేసిన స్థానికులు, సిపిఎం నేతలపై రియల్ ఎస్టేట్ మాఫియా దుండగులు దాడులకు పాల్పడడం ఆందోళన రేకెత్తిస్తోంది. దీనిపై ఫిర్యాదు చేసినా కేసు నమోదులో పోలీసుల తాత్సారం, రియల్టర్ల ఆగడాలకు మరింత ఊతమిచ్చేదిగా ఉందనే ఆందోళన వ్యక్తమౌతోంది. వివరాలు పరిశీలిస్తే...

మండలంలోని భీంపోలు పంచాయతీ సరియాపల్లి రెవెన్యూ సర్వేనెంబర్ 66.లో 13ఎకరాల సీలింగ్ ప్రభుత్వ భూమిని కబ్జాకు పాల్పడిన ఇటోరి వెంచర్ కంపెనీ రియల్టర్ బి నగేష్, ఆక్రమిత భూమిని జెసిబితో చదును చేయి స్తుండగా గుర్తించిన స్థానికులతోపాటు సిపిఎం నేతలు ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎన్.మాణిక్యంకు ఫోను చేశారు. దీనిపై స్పందించిన తహశీల్దార్, ఈనెల 3న విఆర్ఓ ఆశ, సర్వేయర్ భాస్కర్‌ను పరిశీలనకు పంపారు. వారితోపాటు ఆక్రమిత భూమి వద్దకు ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు జేష్ట వెంకటరమణ, ఆర్. శ్రీనివాస్ పరిశీలనకు వెళ్లగా, అక్కడున్న కొంతమంది పరిశీలనకు వెళ్లిన రెవెన్యూ ఉద్యోగులు, నాయకులను దుర్భాషలాడుతూ నానా అలజడి సృష్టించారు.దీన్ని జీర్ణించుకోలేక ఇటోరి వెంచర్స్ కంపెనీలో పనిచేస్తున్న రామచంద్రపురం గ్రామానికి చెందిన డుంబరి కృష్ణ, పంచాలి పోలురాజు, తెమ్మ జానకేశవరావు, పెరుమల అప్పలరాజు తదితరులు శనివారం ఉదయం జేష్ట వెంకటరమణ ఇంటికి వెళ్లి ఆయన భార్య పిల్లలకు బెదిరింపులకు గురిచేశారని బాధితులు ఆరోపించారు. గుమ్మకోట పంచాయతీ భీమవరం గ్రామంలో రాకోటి శ్రీను ఇంట్లో వెంకటరమణ కూర్చుని ఉండగా మళ్లీ బయటకు లాగి విచక్షణా రహితంగా దాడిచేశారని బాధితులు అంటున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు ఇదే గ్రామంలో కొనుగోలు చేసిన జిరాయితీ భూమికి ఆనుకుని, 56, 61, 66, 27 సర్వేనెంబర్లలోని గెడ్డ పురంబోకు, బంజరు భూమిని కూడా నగేష్ ఆక్రమణకు పాల్పడ్డాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాన్‌షెడ్యూల్ ప్రాంతంలోని గిరిజన భూములు దురాక్రమణదారులపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో వారు మరింత రెచ్చిపోయి ఇలా దాడులకు తెగబడుతున్నారని ఆరోపణలున్నాయి. దీనిపై ప్రశ్నించిన స్థానిక నాయకులపై ప్రభుత్వ పెద్దల అండదండలతో పెట్రోగిపోయిన భూస్వాములు, తమ అనుచరులతో దాడులకు తెగబడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

దాడి కారకులపై చర్యలేవీ..?

ప్రభుత్వ భూమి రక్షించాలని ప్రశ్నించినందుకు తనపై దాడి చేశారని ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు జేష్ట వెంకటరమణ పోలీస్ ఫిర్యాదు చేసినప్పటికీ, దాడికి పాల్పడిన వారిపై ఇప్పటివరకు ఎటువంటి కేసు నమోదు చేయకపోవడం సరికాదని సిపిఎం జెడ్‌పిటిసి దీసరి రాజు. సిపిఎం మండల కార్యదర్శి కిల్లో మొస్య ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించాలని, దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదుచేసి కఠినచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గిరిజనులపై రియల్ మాఫియా దాడి దుర్మార్గం

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర : బాధితునికి పరామర్శ

ఆసుపత్రిలో ఉన్న బాధితుడిని పరామర్శిస్తున్న నేతలు

అరకులోయ రూరల్: అనంతగిరి మండలం నాన్‌షెడ్యూల్ ఏరియాలో స్థానిక గిరిజనులపై రియల్ ఎస్టేట్ మాఫియా గూండాల దాడి చేయటం అన్యాయమని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య, సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు ఆక్షేపించారు. భూబకాసురుల ప్రోద్బలంతో వారి అనుచరుల దాడిలో గాయపడి, అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు జ్యేష్ట వెంకటరమణను సోమవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర, జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, .అనంతగిరి మండలం భీంపోలు పంచాయతీ సరియపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 66 లో 13 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూములు రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, ఇటోరి వెంచర్స్ యజమాని బి నగేష్ అనుచరులు కిరాయి రౌడీలు,గూండాలు భౌతికంగా దాడి చేయటం దారుణమన్నారు. సరియాపల్లి రెవెన్యూలో రియల్టర్లు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని చదును చేస్తుంటే అక్కడకు వెళ్లి ప్రశ్నించారనే అక్కసుతో తర్వాత ఇంటికి వెళ్లి చంపేస్తామని బెదిరించడం, గుమ్మకోట పంచాయితీ భీమవరం గ్రామంలో రాకోటి శ్రీనివాస్ ఇంటి దగ్గర ఉండగా కర్రలు మారణాయుధాలతో దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారితోపాటు వారిని ప్రోత్సాహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. నగేష్‌పై ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి: జెడ్‌పిటిసి గంగరాజు

నాన్ షెడ్యూల్ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి, తక్షణమే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని జెడ్‌పిటిసి దీసరి. గంగరాజు డిమాండ్ చేశారు. భీంపోలు పంచాయతీ సరియాపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 66లో ఉన్న 13ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని ఇటోరి వెంచర్ కంపెనీకి చెందిన బి.నగేష్ కబ్జాకు పాల్పడి జెసిబిలతో చదును చేయిస్తున్నాడన్నారు. ఆ భూమిని రెవెన్యూ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ భూమి ఆక్రమణపై ప్రశ్నించిన ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు జేష్ట్య వెంకటరమణపై దాడికి పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు, ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు పోరాటాన్ని ఉధృత్యం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిల్లో. మొస్య ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు ఎస్. నాగులు పాల్గొన్నారు

నారాయణపురంలో ఆందోళన చేస్తున్న స్థానికులు, సిపిఎం నేతలు

మంచినీటి సమస్యను పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి-చింతూరు

మండలం తుమ్మల గ్రామపంచాయతీ పరిధి నారాయణపురం గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు సీసం సురేష్ మాట్లాడుతూ నారాయణపురం గ్రామంలో ఉన్న సోలార్ ట్యాంక్ మోటర్ రిపేర్ కావడంతో రెండు నెలలుగా ఆ గ్రామస్తులు మంచినీటి సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై తుమ్మల గ్రామపంచాయతీ కార్యాలయానికి అనేకమార్లు తిరిగినా, పంచాయతీ కార్యదర్శికి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కి విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణపురం గ్రామంలో మంచినీటి సమస్యతోపాటు, వీధిలైట్లు వెలగడం లేదని, విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలో నిధులు లేవని, ఆ సమస్యను తాము పరిష్కారం చేయలేమని పంచాయతీ అధికారులు దర్జాగా సమాధానం చెబుతున్నారన్నారు. గ్రామ పంచాయతీలో నిధుల కొరత ఉంటే పైఅధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి తప్పా చేతులెత్తేస్తుంటే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. తక్షణమే పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే బుధవారం గ్రామస్తులతో కలిసి ఐటిడిఏ ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మొట్టం రాజయ్య, నాయకులు పంతులు, రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని చట్టి ఐసిడిఎస్ సెక్టార్ పరిధి వేగితోట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ సోమవారం సందర్శించారు. ప్రతి నెల అంగన్వాడీ కేంద్రంలో జరిగే గ్రోత్ మానిటరింగ్‌ని ఆయన పర్యవేక్షించారు. గ్రోత్ మానిటరింగ్ ప్రాముఖ్యత తెలియజేస్తూ 0-6 వయస్సు పిల్లలలో లోప పోషణ లేకుండా చుడాలని, పిల్లల అండర్ వెయిట్, వస్టింగ్ లేదా స్టంటింగ్‌లో మోడరేట్ లేదా సీవియర్‌లో ఉంటే వారిని నార్మల్‌కి తీసుకురావాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల బరువు ఎత్తు తుయ్యడం, పెరుగుదల పర్యవేక్షణను ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి పి.విజయగౌరి వివరించారు. కేంద్రంలో ప్రీ స్కూల్ పిల్లలతో ముచ్చటించి వారి ఆట పాటలను వీక్షించారు. అంగన్వాడీ కేంద్రం భవనం అసంపూర్ణంగా ఉండడం గమనించి తదుపరి మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జీడి రైతులకు ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి-దేవీపట్నం : మండలంలోని ఇందుకూరుపేట వెలుగు కార్యాలయంలో మండల టిడిపి అధ్యక్షులు మరిచెట్ల వెంకటేశ్వరరావు, ఎంపీడీవో డిఎం రత్నకుమారి, ఎంపిటీసీ తుర్రం జగదీష్ దొర, ఎన్ఇర్ఇజిఎస్ ఏపీవో జి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జీడిమామిడి రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. మండలంలో సుమారు 295 మంది లబ్ధిదారులకు 19,19,19 నైట్రోజన్ ఎరువు, ఎఫ్ ఫోర్ ఎరువు, వేప నూనె తదితర మూడు రకాల ఎరువులు అందించినట్లు వారు తెలిపారు. ప్రతి ఒక్క జీడిమామిడి రైతు దీనిని తీసుకెళ్లి శ్రద్ధగా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు చారపు వెంకట రాయుడు, కర్రి మహేష్ నాయుడు, ఐటీడీఏ ఎంపీఈఓ పి శోభన్ బాబు, సబ్ అసిస్టెంట్ బి అప్పలస్వామి ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

జీడి రైతులకు ఎరువులు అందిస్తున్న అధికారులు

సమన్వయంతో గంజాయి నిర్మూలన

జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో గంజాయి సాగు నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. గంజాయిని సమూలంగా రూపుమాపడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో గంజాయి నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి సాగు నిర్మూలించిన గ్రామాలను అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. గంజాయి సాగు విడిచిపెట్టిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యానవన తోటలు అందిస్తామన్నారు. వ్యవసాయ శాఖ అటవీ శాఖ ఉద్యానవన శాఖ, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న గంజాయి నిర్మూలన కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటు చేయడానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలను మంజూరు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గంజాయి నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వీఆర్వోలు సచివాలయం సిబ్బంది గంజాయి సాగుపై ప్రత్యేక దష్టి పెట్టి నివారణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. గంజాయి సాగును చూసి చూడనట్టు వదిలివేస్తే జిల్లాకు చెడ్డ పేరు వస్తుందన్నారు

ఎలైట్ యాంటీ నార్కోటిక్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్ గ్రూప్ (ఈగల్) ఐజి ఆకే రవికృష్ణ మాట్లాడుతూ పెదబయలు మండలం పాతకోట గ్రామంలో ఎనిమిది ఎకరాల్లో గంజాయి తోటలను సోమవారం ధ్వంసం చేసామన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు గంజాయి సాగు రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సాగు నిర్మూలనపై గిరిజనులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇటీవల అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి గంజాయి సాగు నిర్మూలనపై అధికారులకు దిశా నిర్దేశం చేశారని చెప్పారు. గిరిజనులకు ప్రత్యామ్నాయ పంటలు అందించడానికి అధికారులు చొరవ తీసుకోవాలని చెప్పారు. గంజాయి తోటలను డ్రోన్ల ద్వారా సర్వే చేస్తున్నామని అన్నారు. ఎక్కడైనా గంజాయి సాగు చేస్తే 1972 కాల్ సెంటరుకు సమాచారం అందించాలని కోరారు.. ఈగల్ వ్యవస్థ గంజాయి నివారణకు పటిష్టమైన చర్యలు చేపడుతుందని గంజాయి సాగును ఉక్కు పాదంతో అణిచివేస్తామని స్పష్టం చేశారు.

జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ గంజాయి నివారణకు చేపట్టిన చర్యలను వివరించారు. పెద్ద ఎత్తున గంజాయి కేసులను నమోదు చేస్తున్నామని చెప్పారు. మైనర్ విద్యార్థులు ఖరీదైన ద్విచక్రాల వాహనాలను నడిపితే సమాచారం అందించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఈగల్ ఎస్పి కె..నగేష్ బాబు, జిల్లా విద్యాశాఖ అధికారి పి. బ్రహ్మాజీరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బి ఎస్ నందు, గిరిజన సంక్షేమ అధికారి ఎల్ .రజిని, డ్వామా పిడి విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రోడ్లు, విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలి

మండల పరిషత్తు సమావేశంలో ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి రంగారెడ్డి

మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి, చిత్రంలో జెడ్‌పిటిసి, తహశీల్దారు, ఎంపిడిఒ

ప్రజాశక్తి-విఆర్.పురం

వరదల సమయంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రహదారులు, వంతెనల మరమ్మతులు, విద్యుత్ లైన్లు ఏర్పాటుపై దృష్టి సారించాలని మండల పరిషత్తు సమావేశంలో ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని రేఖపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో సోమవారం ఎంపిపి కారం లక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదల వల్ల రహదారులు పాడైపోయి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వరదల వల్ల పాడైపోయిన రహదారులు, విద్యుత్ లైన్లు సమస్యలను పరిష్కరించి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు.

శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వచ్చే వరదలకు అన్నవరం గ్రామం వద్ద వాగుపై బ్రిడ్జి కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయని, కొన్ని సంవత్సరాలుగా ఈ మార్గంలో బస్సు తిరగలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరారు. అలాగే సుద్దగూడెం నుంచి తమ్మాయిపేట వరకు రహదారి వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇది పూర్తయితే వరదలు సమయంలో ప్రజలకు రేఖపల్లి రావడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. కుందులూరు నుంచి తులసిపాక వరకు రహదారి వేయాలని, విద్యుత్తు లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్ అండ్ ఆర్ సర్వే అయిపోయి మృతి చెందిన వారి నామినీ ఉన్న వాళ్లకు ప్యాకేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సర్పంచులు పూనెం సరోజినీ, వెట్టి లక్ష్మి, సవలం మారయ్య, సోడి నరసమ్మ, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, రాజపేట ఎంపీటీసీ, తహశీల్దారు సరస్వతి, ఎంపీడీవో శశిభూషణ్‌రావు, సెక్రటరీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్

గిరిజన వ్యతిరేక నిర్ణయాలను అడ్డుకుంటాం

పీసా కమిటీల ఎన్నికల్లో ఆదివాసీ గిరిజన సంఘం నేతలు ఏకగ్రీవం

బీరం పీసా కమిటీ ఉపాధ్యక్షులు కోటిబాబు

కోనేటి పీసా కమిటీ ఉపాధ్యక్షులు సన్యాసిదొర

ప్రజాశక్తి-జి.మాడుగుల : మండలంలో కోనేటి, బీరం గ్రామాల్లో నిర్వహించిన పీసా కమిటీల ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా ఆదివాసీ గిరిజన సంఘం నేతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు వనుగు సన్యాసి దొరను కోనేటి పీసా కమిటీలో ఉపాధ్యక్షులుగా ఎన్నుకోగా, ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి కొటారి కోటిబాబును బీరం పీసా కమిటీలో ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడ తమను పీసా కమిటీల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఐదేళ్లపాటు తమ పదవీకాలంలో గిరిజనానికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా గ్రామసభల ద్వారా కచ్చితంగా వ్యతిరేకిస్తామన్నారు. గిరిజనుల ప్రాధాన సమస్యలపైన జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరించి, చట్టబద్ధత కల్పనకు,. 1/70 చట్టం పటిష్ఠంగా అమలు, మైనింగ్‌కు వ్యతిరేకంగా పోరాడతామన్నారు. గిరిజన గ్రామాల్లో తాగు, సాగునీరు, రహదారులు, అర్హులకు పెన్షన్లు, రేషన్‌కార్డులు, ఇతర సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పనపై గ్రామసభలో తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కొయ్యూరు : మండలంలోని డౌనూరు పంచాయతీ పరిధి తులబాడ పీసా కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సోమవారం తులబాడలో నిర్వహించిన పీసా కమిటీ ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా గిరిజన సంఘం నాయకులు కిల్లో శంకర్, కార్యదర్శిగా గెమ్మెలి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొట్టిక భవానీ, ఎంపీటీసీ బిడిజాన అప్పారావు, వైసీపీ సీనియర్ నేతలు పొట్టిక పోతురాజు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తులబాడ కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శి శంకర్, రాజు

డుంబ్రిగుడ: కంద్రుమ్ పంచాయతీ స్వర్ణయగుడ రెవెన్యూ గ్రామ పీసా కమిటీ ఎన్నికలో స్థానిక సర్పంచ్, ఎన్నికల ప్రత్యేక అధికారి సునీత ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగింది. ఉపాధ్యక్షుడుగా కొర్రా సహదేవ్, కార్యదర్శిగా తాంగుల జగత్, పనసపుట్ రెవెన్యూ గ్రామాల్లో ఉపాధ్యక్షుడిగా ఎస్ రాము, కార్యదర్శిగా కిలో చిన్నంరాజు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కిముడు హరి, పీసా కమిటీ ప్రత్యేక అధికారి వి సునీత,వార్డు సభ్యులు పి గున్ మెతి,వి హెచ్ ఎ శెట్టి జయరాజు ,నాయకులు పాంగి లచ్చన,కొర్రా ముకుంద్, వీఎఓ కొర్రా శ్రీనివాసరావు. పాల్గొన్నారు.

అరకులోయ : అరకులోయ మండలం పెదలబుడు పంచాయతీ పానిరంగని పీసా కమిటీ కార్యదర్శిగా ఎల్‌బి.రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కొర్ర అర్జున్ ఎన్నికయ్యారు. పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాస్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా హెచ్‌పి.కెందు వ్యవహరించారు. గెలుపొందిన వారికి ఎన్నికల అధికారి హెచ్.పి.కెందు, పెదలబుడు సర్పంచ్ దాస్ బాబు, ఈవో రాజ్ కుమార్ ఎన్నికల ధ్రువపత్రాన్ని అందజేశారు.

ఎన్నికల ధ్రువీకరణ పత్రం ఇస్తున్న దృశ్యం

వనభంగిలో మాట్లాడుతున్న జిసిసి బిఎం గాసి

గిట్టుబాటు ధరకు గిరిజన ఉత్పత్తుల కొనుగోలు

జిసిసి కేంద్రాలను వినియోగించుకోండి : జిసిసి బిఎం గాసి

ప్రజాశక్తి- పెదబయలు : ఆదివాసీ గిరిజనులు తాము పండించిన, సేకరించిన అటవీ ఉత్పత్తులు, వాణిజ్య దినుసులను జిసిసి ద్వారా సరైన గిట్టుబాటు ధరనిచ్చి కొనుగోలు చేస్తామని గిరిజన సహకారసంస్థ బ్రాంచి మేనేజర్ వి.గాసి అన్నారు. వనభంగి పంచాయతీ జాడిగూడ, సీకరి పంచాయతీ లేబ్జెరి, అడుగులపుట్టు, కప్పాడ, లక్ష్మీపేట తదితర గ్రామాల్లో విస్తతంగా ప్రచారం చేశారు వనభంగిలో గిరిజనులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఆదివాసీ గిరిజనుల పండించిన, సేకరించిన వాణిజ్య దినుసులను దళారులతో చేతిలో మోసపోకుండా గిట్టుబాటు ధరకు అమ్ముకునేలా అన్ని గ్రామాల్లో కొనుగోళ్లకు చర్యలు చేపడతామన్నారు. గిరిజనులు నేరుగా తమ ఉత్పత్తులను జిసిసి కొనుగోలు కేంద్రాలకు తెచ్చి విక్రయించాలని సూచించారు. ప్రతి జిసిసి డిపో, పంచాయతీ పరిధిలో రైతులు పండించిన పార్చిపెంట్ కాఫీని కిలో రూ. 320, చెర్రీ కాఫీ కిలో రూ.170, రొబాస్త చెర్రీ కాఫీ కిలో రూ.100కు జిసిసి ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తామన్నారు. గిరిజనులు తమ ఉత్పత్తుల అమ్మకానికి ప్రయివేటు వ్యాపారులు, దళారులను ఆశ్రయించి నష్టపోకుండా, జిసిఇస కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు.

ఆరోగ్యశ్రీ ప్రోత్సాహకం పంపిణీ

-రూ.10 లక్షల చెక్కు అందజేసిన కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి చరిత్రలో మొట్టమొదటిసారిగా ఆరోగ్యశ్రీ ఇన్సెంటివ్‌ను సంబంధిత డాక్టర్లకు, నర్సులకు, ఎఎన్ఎం, పారా మెడికల్ సిబ్బంది, ఆయా, తోటీలకు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ అందజేశారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ రూ. పది లక్షల చెక్కును ఆసుపత్రి వైద్య పర్యవేక్షకురాలు డాక్టర్ విశ్వమిత్రకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ విభాగాన్ని ఎపివివిపి నుండి వైద్య విద్యకు మార్చిన అనంతరం ఈ ఏడాదిలో జమ అయిన రూ.పది లక్షలను ఆరోగ్య శ్రీ కింద చికిత్స పొందిన రోగులకు సేవలందించిన ప్రతి ఆసుపత్రి ఉద్యోగికి వారి కేడర్ల ప్రకారం ప్రభుత్వ నిభందనల మేరకు పంపిణీ చేయాలని ఆదేశించారు. పాడేరు ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఆరోగ్యశ్రీ ఇన్సెంటివ్ ను అందించడంలో చొరవ తీసుకున్న డాక్టర్ విశ్వ మిత్రను కలెక్టర్ అభినందించారు. ఇక ముందు కూడా ఆరోగ్యశ్రీ ఇన్సెంటివ్‌ను సంబంధిత డాక్టర్లకు, సిబ్బందికి పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి -పాడేరు : భూ సమస్యల సత్వర పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవాం పాడేరు మండలం గుత్తులపుట్టు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం రైతుల వద్దకే వస్తోందన్నారు. రెవెన్యూ పరమైన సమస్యలకు దరఖాస్తులు అందజేస్తే పరిష్కరిస్తారన్నారు. భూ సమస్యలు మ్యుటేషన్లు, ధ్రువ పత్రాలు జారీకి ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని స్పష్టం చేసారు. భూ సరిహద్దుల సమస్యలు, భూముల ఆక్రమణలు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికేట్లు జారీ చేస్తామన్నారు. రెవెన్యూ సదస్సులులో సమస్యలను అధికారులు దష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది గ్రామ సభలలో అందుబాటులో ఉంటారని సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపడతారని కలెక్టర్ వివరించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూ సమస్యలు పరిష్కరించే అధికారం ఏజెన్సీలో సబ్ కలెక్టరుకు ఉందని, సబ్ కలెక్టర్ తీర్పులో న్యాయం జరగ లేదనుకుంటే ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి అప్పీలు చేసుకోవచ్చన్నారు. గ్రామ సభలో డిప్యూటి తహసిల్దార్, స్థానిక సర్పంచ్ ఇతర ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కించాయిపుట్టు పీసా కమిటీ ఎన్నిక రసాభాస

మూడో అభ్యర్థి తీరుతో ఎన్నిక గందరగోళం, వాయిదా
రిటర్నింగ్ అధికారి తీరుపై ఆదివాసీ గిరిజన సంఘం ఆందోళన

ఆందోళన చేస్తున్న ఈశ్వరి, ఆమె మద్దతుదారులు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండలంలోని కించాయిపుట్టు క్లస్టర్‌లో సోమవారం నిర్వహించిన పీసా కమిటీ ఎన్నికల రసాభాసగా మారి, చివరకు వాయిదా పడింది. ఎంపిడిఒ శ్రీసాయి హర్ష ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించి, కమిటీ ఉపాధ్యక్షుడు, కార్యదర్శుల పదవులను ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కార్యదర్శి పదవికి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేయడంతో ఎన్నిక అనివార్యమైంది.

ఈ ఎన్నికలలో ఆదివాసీ గిరిజన మహిళ సంఘం అధ్యక్షురాలు సోనియా.ఈశ్వరి, చిట్టపులి విశ్వనాథం, సోనియా ప్రసన్నకుమార్ కార్యదర్శి పదవికి నామినేషన్ వేశారు, లాటరీ పద్ధతిలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వారిని నెంబర్లు కేటాయించగా, ఒకటో క్రమసంఖ్య విశ్వనాథంకు, రెండో క్రమసంఖ్య సోనియా ఈశ్వరికి, మూడో క్రమసంఖ్య ప్రసన్నకుమార్‌కు వచ్చింది. దీనిపై చేతులెత్తే పద్ధతిన ఎన్నిక నిర్వహించగా, విశ్వనాధానికి 61మంది, ఈశ్వరికి 83మంది అనుకూలంగా చేతులెత్తి మద్దతు ప్రకటించారు. అయితే మూడో క్రమసంఖ్యలో ఉన్న ప్రసన్నకుమార్‌కు తక్కువ మంది మద్దతునిచ్చే పరిస్థితుల్లో, ఆయన, తనకు అనుకూలంగా ఉన్నవారితో కలిసి, మొదటి క్రమసంఖ్యలో ఉన్న విశ్వనాథం వద్దకు చేరి ఎన్నిక నిర్వహించాలని పట్టుబట్టారు. అత్యధికమంది మద్దతునిచ్చిన ఆదివాసీ గిరిజన మహిళా సంఘం కార్యదర్శి ఈశ్వరి అభ్యంతరం వ్యక్తంచేశారు. పోటీలో ఉన్న వ్యక్తి విత్‌డ్రా చేసుకోకుండా, వేరొకరికి మద్దతునివ్వడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఎన్నిక కాస్తా రసాభాసగా మారింది. మూడుగంటలపాటు గందరగోళ పరిస్థితి నెలకొనడంతో, ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన ఎంపిడిఒ, పోటీ అభ్యర్థులను, ప్రజలను సమన్వయపరచకుండా, ఏకపక్షంగా పీసా కార్యదర్శి ఎన్నికలను నిలుపుదల చేశారు. దీనిపై ఆధిక్యంలో ఉన్న ఈశ్వరితోపాటు, ఆమెకు మద్దతుగా వారితోపాటు ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్, మండల అధ్యక్షులు ఎంఎం శ్రీను తదితరులు ఆందోళన చేశారు.

పీసా కార్యదర్శిగా జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా 83మంది చేతులెత్తి ఆమోదం తెలిపిన ఈశ్వరిని ఎన్నికైనట్లు ప్రకటించకుండా, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వాయిదా వేయడం సరికాదన్నారు. మెజార్టీ ఓట్లు వచ్చిన ఈశ్వరి ఎన్నికను ధ్రువీకరించకపోతే, ఐటిడిఎ పిఒకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి దానికి సమ్మతించకుండా వాయిదా వేయడంతో వారంతా ఆందోళన చేపట్టారు. ఆందోళనలో ఆదివాసీ గిరిజన మహిళ సంఘం కార్యదర్శి విజయ, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు వి.లైకోన్, ఓటర్లు వి.మత్స్యలింగం, ఎం.డొంబన, కె.బొడిరాజు, సుందర్ రావు, తిరుపతిరావు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కొత్త పోయిపల్లిలో ఆకస్మికంగా పర్యటించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి- పెదబయలు : మండలం పెదకోడాపల్లి పంచాయతి కొత్త పోయిపల్లి గ్రామాన్ని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కలెక్టర్ వద్ద పలు సమస్యలు ఏకరువు పెట్టారు. ముఖ్యంగా జల్‌జీవన్ మిషన్‌లో బోర్ మంజూరు అయినప్పటికీ కనెక్షన్లు ఇవ్వలేదని, తాగునీరు సరిపోవటం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ అక్కడ ఉన్న ఊట నీటిని స్టోర్ చేసి పంపింగ్ ద్వారా సరఫరా చేయడానికి, మిగిలిన నీటిని సాగుకు మళ్ళించడానికి గల అవకాశాన్ని పరిశీలించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వాటర్ అండ్ శానిటేషన్ కమిటీల ఎన్నికలు ఒక వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.వర్షాకాలంలో చెరువు నిండి, కిందన ఉన్న పొలాలు ముంపునకు గురవుతున్నాయని, దాని వల్ల నష్టపోతున్నామని కొందరు కలెక్టర్ దృష్టికి తేగా ఎన్ఆర్ఇజిఎస్ కింద ప్రవాహ మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల నిర్వహిస్తున్న భవనం శిధిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో నూతనంగా భవనం పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పాఠశాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించడంతో పాటు విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఎక్కాలు చదివించడం, లెక్కలు చేయించడం చేసి సంతప్తి వ్యక్త పరిచారు. బేస్ లైన్ పరీక్షలో సి గ్రేడ్ లో ఉన్న విధ్యార్ధులతో లేకలు చేయించి, చదివించి వారు మెరుగుపడటం పట్ల అభినందించారు. గామంలో 53 ఇళ్లుండగా, 20 మంది డిగ్రీ చదువుకుని ఖాళీగా ఉండటాన్ని గుర్తించిన కలెక్టర్ వారికి అవసరమైన నైపుణ్య శిక్షణలు అందిస్తామన్నారు. అక్కడ అందరూ పివిటిజి తెగకు చెందిన వారే ఉన్నారని, ఎవరికీ స్వంత ఇల్లు లేదని తెలుసుకుని పిఎంఎవై కింద మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదే గ్రామంలో జరుగుతున్న పీసా గ్రామ సభ ఎన్నికల నిర్వహణను పరిశీలించిన కలెక్టర్ ఎన్నిక విధానాన్ని పరిశీలించి ఎటువంటి అవకతవకలు అవకాశం లేకుండా పారార్శకంగా నిర్వహించాలన్నారు. కొత్త పోయిపల్లి, వాకపల్లి గ్రామాలకు చెందిన 274 మంది ఓటర్లలో కోరంకు సరిపడా 93 మంది హాజరు కావడంతో ఉపాధ్యక్ష, కార్యదర్శిల ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో పాంగి భాస్కరరావు, కామేశ్వర రావు, ఉపాధ్యక్షులుగా, పాంగి భాస్కరరావు,కిత్తన్న కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.కార్యక్రమాలలో ఎంపిడిఓ పూర్ణయ్య, పీసాఎన్నికల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధక శాఖ ఎడి రాజా రవికుమార్, పోలింగ్ అధికారి వి. చలపతి రావు, సర్పంచ్ బట్టి చిట్టిబాబు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మాట్లాడుతున్న ఐజి, ఎస్‌పి

8 ఎకరాల్లో గంజాయి తోట ధ్వంసం

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలో మారుమూల కుంతుర్ల పంచాయతీ పాఠపాడు గ్రామంలో సోమవారం 8 ఎకరాల గంజాయి మొక్కలను ధ్వంసం చేసినట్లు స్థానిక ఎస్ఐ కె రమణ తెలిపారు ముందస్తు సమాచారం ప్రకారం డ్రోన్ కెమెరాల ద్వారా సర్వే నిర్వహించామన్నారు. మారుమూల ప్రాంతం కావడంతో ఉన్నతాధికారులతో వచ్చి, సిబ్బంది సహకారంతో దాడి చేసి గంజాయి మొక్కలు ధ్వంసం చేశామన్నారు. గంజాయి పంటలు పండించే ఆలోచన మానుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ జి, రంగారావు సర్వేయర్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

అత్యాచార బాధితురాలికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి పాడేరు: జి.మాడుగుల మండలం గాంధీనగర్ ఆశ్రమ పాఠశాలలో అత్యాచార ఘటనపై రాష్ట్ర ప్రభుత్వంఅధికారులు స్పందించకపోతే న్యాయం కోసం నిరాహార దీక్షలు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కృష్ణ, మహిళా సంఘం నాయకులు కంబిడి లతకుమారి తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ: విద్యార్థినిపై అత్యాచారం ఘటనపై తల్లితండ్రులు న్యాయం చేయాలని అనేక రూపాల్లో ఉద్యమాలు చేపడుతున్న, అధికారులు స్పందించకపోవడం చాలా దుర్మార్గమన్నారు ఇంత జరిగినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్ఎం, వార్డెన్ లను సస్పెండ్ చేయకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్ఎం వార్డెన్ లను తక్షణమే సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో ఐటిడిఎ ముందు నిరాహార దీక్షలు చేపడతామని తల్లితండ్రులు, విద్యార్థి సంఘాలు మహిళా సంఘాలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ నేతలు శ్రీలత, వినీత్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయాలి

ప్రజాశక్తి-చింతపల్లి: గర్భిణులకు క్రమం తప్పకుండా అన్ని రకాల పరీక్షలను నిర్వహించాలని ఆరోగ్యశాఖ కేంద్ర రీజినల్ అధికారి డాక్టర్ జెఏ ప్రీతం అన్నారు. సోమవారం అల్లూరి జిల్లా ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ (ఐసిటిసి) క్లస్టర్ ఇన్చార్జి రామచంద్రరావుతో కలిసి చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాంతీయ ఆసుపత్రి ఐసిటిసి వైద్యాధికారి ఇందిరా ప్రియాంక సమక్షంలో ఐసిటిసి కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో నమోదవుతున్న గర్భిణుల పరీక్షల పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు ఐసిటిసి విభాగం సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి,హెచ్ఐవి తో పాటు రక్తపోటు, పచ్చకామెర్లు, షుగర్, మూత్ర, గనేరియా, సిపిలిస్ వంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షల్లో ఈ లక్షణాలు ఎంతమందికి నమోదు అవుతుందని అడిగి తెలుసుకున్నారు. లక్షణాలున్న గర్భిణులు క్రమం తప్పకుండా మందులు వాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ కౌన్సిలర్ మధుబాబు, ల్యాబ్ టెక్నీషియన్ నెల్లి గోవింద్ పాల్గొన్నారు.

వికలాంగుల బాగోగులపై కెజిహెచ్ బృందం పరిశీలన

ప్రజాశక్తి -అనంతగిరి : ప్రమాదాలు. పుట్టుకలతో శరీర భాగాలు కోల్పోయి, మంచాన పట్టి, ప్రభుత్వ పింఛను అందుకుంటున్న వికలాంగులను సోమవారం విశాఖపట్నం కెజిహెచ్ వైద్యుల బృందం పరిశీలించింది. వారి ఆరోగ్యం, బాగోగులను తెలుసుకోవాలన్న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కెజిహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ సింహాచలంనాయుడు, డాక్టర్ పి.విజయ్‌కుమార్ డాక్టర్ కృష్ణ బృందం సోమవారం కొత్తూరు. చిలకలగెడ్డ, కాశీపట్నం, అనంతగిరి ఎగువశోభ, బొర్రా, కోణాపురం పంచాయతీల్లో పర్యటించారు. పింఛను ఆధారంగా జీవిస్తున్న వికలాంగులను కలిసి, వారి ఆరోగ్య బాగోగులను అడిగి తెలుసుకున్నారు.

శుభ్రతా పనులు చేయిస్తున్న సంతోష్ కుమార్

ఆలయ ప్రాంగణం, స్నానాల గట్టు శుభ్రం

ప్రజాశక్తి-విఆర్.పురం : రెండో భద్రాద్రిగా పేరుగాంచిన మండలంలోని శ్రీరామగిరిలోని శ్రీసుందర సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 9, 10 తేదీల్లో జరగనున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్ ఆధ్వర్యాన సోమవారం ఆలయ ప్రాంగణం, స్నానాల గట్టు వెళ్లే మెట్లు మార్గం, చుట్టుపక్కల పొదలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి రోజున ప్రజలు అధిక సంఖ్యలో దర్శనానికి వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందు జాగ్రత్త చర్యగా ఈ పనులు చేపట్టామని తెలిపారు. గుడికి ఇరు పక్కల, స్నానాల గట్టు మెట్లుపై పేరుకుపోయిన మట్టిని తొలగించి భక్తులు స్థానాలు ఆచరించడానికి, దర్శించుకోవడానికి అనుకూలంగా తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, కె.సత్యనారాయణ, శాఖ కార్యదర్శి ఆత్మకూర్ కాంతారావు, నాగేశ్వరరావు, కార్యకర్తలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా భైరవమూర్తి జాతర

ప్రజాశక్తి హుకుంపేట: ఏజెన్సీ ప్రాంతంలో మొట్టమొదటిగా నిర్వహించే తోంకోట భైరవమూర్తి, పంచపాండవుల ఆలయంలో జాతర, పండుగను వైభవంగా నిర్వమించారు. సంక్రాంతి పండుగకు ముందుగా నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా హుకుంపేట, అనంతగిరి మండలాల సరిహద్దులోని పెద్దకోట పంచాయతీ తోంకోట గ్రామంలో భైరవమూర్తి, పంచ పాండవుల పండగ అనాదిగా ఆచారబద్ధంగా నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం నుంచి రెండురోజులపాటు సాగే పండుగను గిరిజన సంస్కృతి సాంప్రదాయాలతో వేడుకగా నిర్వహించగా, ఎపిలోని మూడు మండలాలలతోపాటు సరిహద్దు ఒడిశా గ్రామాల నుంచి పెద్దఎత్తుకు భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

గిరిజనులు కోళ్లు మేకలు, పోతులు బలిచ్చారు. సోమవారం జాతర చివరి రోజున హుకుంపేట మండల టిడిపి నాయకులు సంతారి పంచాయతీ ఇన్‌ఛార్జి చిట్టిబాబు, మాజీ కోఆపరేటివ్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ నూకరాజు, యువ నాయకులు కుడేలి నూకరాజు, ఏడే సింహాచలం, జన్ని రమేష్, సంతారి పిసా ఉపాధ్యక్షులు పాడి సంజీవరావు, జన్ని వెంకటరమణ, కార్యదర్శులు బోయిని చిన్నయ్య, కిల్లో రామ్మూర్తి, కివర్ల మాజీ ఎంపిటిసి దురియా నూకరాజు తదితరులు భైరవమూర్తి, పంచ పాండవులను దర్శించుకుని ప్రత్యేక పూజలు, మొక్కుబడులు తీర్చుకున్నారు.

'ఆ ప్రాజెక్టులన్నీ మేం తెచ్చినవే'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రధాని మోడీ ఈ నెల 8న విశాఖపట్నంలో భూమి పూజ చేస్తున్న, ప్రారంభిస్తున్న ప్రాజెక్టులన్నీ గత ప్రభుత్వంలో సిఎం వైఎస్.జగన్ చొరవతో సాధించినవేనని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. సోమవారం ఉదయం మద్దిలపాలెం సమీపంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందిందన్న ఆయన ఈ విషయంపై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం విశాఖ వచ్చిన మంత్రి నారా లోకేష్ ఈ ప్రాంతంపై అవగాహనా రాహిత్యంతో అర్థం లేకుండా మాట్లాడారన్నారు. ఇప్పటికీ తన శాఖపై పట్టు సాధించలేకపోయిన లోకేష్ గత వైసిపి ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ప్రధాని మోడీతో నిర్దిష్ట ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

మార్మోగిన ఉక్కు నినాదం

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకోవాలని కార్మికులు భారీ బైకు ర్యాలీ
కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు

కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఉక్కు కార్మికులు

నగరంలో సాగుతున్న బైకు ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఉక్కునగరం విలేకరులు

విశాఖ నగరమంతటా సోమవారం ఉక్కు పరిరక్షణ నినాదాలు హోరెత్తాయి. ఈ నెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకుంటున్నట్టు స్పష్టమైన ప్రకటన చేయాలన్న డిమాండ్ అందరి నోటా వినిపించింది. విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టారు. తొలుత కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం నుంచి గాజువాక, ఎన్ఎడి జంక్షన్, కంచరపాలెం మీదుగా భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. బీచ్ రోడ్డులో వాహనాలను విడిచిపెట్టి అక్కడ నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివచ్చారు. అక్కడ పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు కలెక్టరేట్ ప్రధాన ద్వారాన్ని మూసివేశారు. దీంతో నిరసనకారులంతా రోడ్డుపై బైఠాయించి మండుటెండలో నిరసన తెలిపారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్.రావు, కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్, ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, నాయకులు యు.రామస్వామి, వైటి.దాస్, ఎన్.రామారావు, నీరుకొండ రామచంద్రరావు, విల్లా రామ్మోహన్ కుమార్, వరసాల శ్రీనివాసరావు, కె.దాలినాయుడు, దొమ్మేటి అప్పారావు, సిఐటియు నాయకులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, కెఎం.శ్రీనివాసరావు, పి.మణి, ఎస్.జ్యోతీశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు జరుగుతున్న కుట్రలను తెలియజేశారు. అనంతరం జెసి మయూర్ అశోక్‌కు వినతిపత్రం సమర్పించారు.

'ఉక్కు'పై మోడీ స్పందించాలి
నేడు, రేపు నిరసనలకు జెఎసి పిలుపు

విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్టు, సొంత గనులు కేటాయిస్తున్నట్టు, ప్లాంట్‌ను పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించేందుకు అన్ని వనరులూ కేటాయిస్తున్నట్లు ప్రధాని మోడీ విశాఖ పర్యటనలో స్పష్టంగా ప్రకటించాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. జెఎసి సమావేశం సిఐటియు జిల్లా కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ ఛైర్మన్లు భోగవిల్లి నాగభూషణం, ఎం.మన్మథరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియు జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.మణి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, కెవిపిఎస్ జిల్లా నాయకులు వై.రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్‌కుమార్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి తదితరులు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని ప్రకటనలు చేస్తున్నారుగానీ కేంద్ర మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వడం లేదన్నారు. పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడవనివ్వడం లేదన్నారు. లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నట్టేటముంచుతూ పక్కనున్న అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆఘమేఘాల మీద చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. విశాఖపట్నం, రాష్ట్ర ప్రయోజనాలకు పూర్తి విరుద్ధంగా ముఖ్యమంత్రి చర్యలు ఉన్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై మోడీ ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా ఈ నెల 7, 8 తేదీల్లో జిల్లాలోని అన్ని కార్మిక కేంద్రాలు, పరిశ్రమల వద్ద నిరసనలు చేపట్టాలని, బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించాలని, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 8న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని జెఎసి సమావేశం నిర్ణయించింది. ఆయా కార్యక్రమాల్లో కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేసింది. సమావేశంలో జెఎసి భాగస్వామ్య సంఘాల నాయకులు టి.నూకరాజు, కె.కుమారి, అగస్తీన్, జి.అజయ్, పి.సాయితేజ, జి.పల్లవి పాల్గొన్నారు.

సెవెన్ హిల్స్ కార్మికుల ఆకలి యాత్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ కార్మికులకు బకాయి ఉన్న జీతాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ, సోమవారం విశాఖ జిల్లా హాస్పిటల్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సెవెన్ హిల్స్ ఆసుపత్రి నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ఆకలి యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.రాజు, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేకల నాగేశ్వరరావు

నిలిపివేసిన ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కూనవరం : విలీన మండలాల మీదుగా రాష్ట్ర రాజధానికి, జిల్లా కేంద్రానికి నడిచే ఆర్టీసీ బస్సులను అధికారులు నిలిపివేశారని, వాటిని తక్షణమే పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆవుల నాగమయ్య భవన్‌లో సిపిఎం నాయకులు తలగాని నాగరాజు అధ్యక్షన సోమవారం జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు విలీన మండలాలను కలుపుతూ అల్లూరి జిల్లా కేంద్రానికి నడుపుతున్న పాడేరు వయా చింతూరు, కూనవరం మీదుగా భద్రాచలం నడుపుతున్న బస్సును నిలిపివేశారని తెలిపారు. దీని వల్ల నిరుద్యోగ యువతీ యువకులు, ప్రభుత్వ అధికారులు, ప్రజలు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రం పాడేరుకు వెళ్లి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే విజయవాడ నుండి కుంట గ్రామ వరకు నిర్వహించే బస్సు సర్వీస్‌ను కూడా ఆపేశారని తెలిపారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుండి గుంటూరు నుండి రేఖపల్లికి, సికింద్రాబాద్ నుండి కూనవరానికి ఆర్టీసీ బస్సులు నడిపేవారని తెలిపారు. ఈ బస్సులు కూడా నిలిపివేయడంతో రాష్ట్ర రాజధాని విజయవాడకు ప్రయాణ సౌకర్యం లేకుండా పోయిందని, అటు హైదరాబాద్ వెళ్లడానికి ఇబ్బంది పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. విలీన మండలాలపై ప్రభుత్వాలకు ఈ వివక్ష తగదన్నారు. ఒకపక్క పోలవరం ప్రాజెక్టు పేరుతో ముంచుతూ.., మరోపక్క ఉన్న కనీస సౌకర్యాలను తొలగిస్తూ ముంపు మండల ప్రజలను పొమ్మనలేక పొగ పెట్టే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పాడేరు జిల్లా కేంద్రానికి, హైదరాబాదుకు, విజయవాడకు విలీన మండలాల మీదుగా బస్సులు నడపాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మండల కమిటీ సభ్యులు మడకం నాగమణి, తాలూరి శ్రీనివాసరావు, మాడెం బాబు, తెల్లం తమ్మయ్య పాల్గొన్నారు

ప్రధాని పర్యటనపై వరుస సమీక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 8న ప్రధాని మోడీ విశాఖ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లుపై నగరంలో సోమవారం వరుస సమీక్షలు సాగాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహచర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి విశాఖ సర్క్యూట్ హౌస్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలన్నారు. ఉత్తరాంధ్ర వైభవాన్ని చాటిచెప్పాలన్నారు. ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా పలు అభివృద్ధి కార్యక్రమాలను మోడీ ప్రారంభిస్తారని తెలిపారు. ప్రధాని పర్యటన రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సిఎం.రమేష్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ కార్యాలయంలో..

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. సోమవారం సాయంత్రం విఎంఆర్‌డిఎ కార్యాలయ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడీ బహిరంగ సభలో పాల్గొనే ముందు జరిగే రోడ్ షోకు పెద్ద ఎత్తున పార్టీ క్యాడర్‌ను తరలించేలా నాయకులు సమాయత్తం కావాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, గణబాబు, ఎమ్మెల్సీలు చిరంజీవిరావు, డి.రామారావు, విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ ఎంవి.ప్రణవ్ గోపాల్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించారు.